సాక్షి ప్రకాశం

బుధవారం । 21 । జూన్ । 2023



భీకర గాలులు..మోస్తరు వాన

జిల్లాలో పలుచోట్ల మంగళవారం ఈదురుగాలులతో మోస్తరు వర్షం పడింది. పలుచోట్ల పిడుగులు పడ్డాయి.

- 8లో..



సమగ్ర దర్యాప్తుతో నిందితులకు శిక్ష

మాదకద్రవ్యాల కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా సమగ్ర దర్యాప్తు చేయాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
39 /28

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆర్బీకేలను రైతులు సద్వినియోగం చేసుకోండి



పచ్చిరొట్ట ఎరువులను రాయితీపై అందిస్తున్న హెల్త్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు

చీమకుర్తి: రైతు భరోసా కేంద్రాన్ని గ్రామాల్లో రైతులు సద్వినియోగం చేసుకోవాలని హెల్త్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు రైతులకు సూచించారు. మంగళవారం ఆయన సంతనూతలపాడు మండలం ఎండ్లూరులోని రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించారు. ఆర్బీకే ద్వారా రైతులకు అందిస్తున్న సేవల రకాలు, వ్యవసాయ సిబ్బంది అందిస్తున్న సహకారం అడిగి తెలుసుకున్నారు. ఆర్బీకేలో ఉన్న కియోస్క్ యంత్రం పనిచేస్తున్న విధానాన్ని స్వయంగా పరిశీలించారు. అనంతరం రైతులకు 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట ఎరువులను పంపిణీ చేశారు. ఆయన వెంట జేసీ శ్రీనివాసరావు, జిల్లా జేడీఏ ఎస్.శ్రీనివాసరావు, డీడీ రమేష్‌బాబు, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

రేపు నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ సింగిల్ మేజర్‌లపై సదస్సు

ఒంగోలు: ప్రస్తుత విద్యా సంవత్సరంలో యూనియన్ గ్రాంట్స్ కమిషన్ ఆదేశాల మేరకు నూతనంగా ప్రవేశపెట్టిన నాలుగు సంవత్సరాల డిగ్రీ సింగిల్ మేజర్‌లపై స్థానిక శ్రీహర్షిణీ డిగ్రీకాలేజీలో గురువారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రకేసరి యూనివర్శిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జి.సోమశేఖర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ఉన్నత విద్యామండలి, ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఈ సదస్సుకు యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ యం.అంజిరెడ్డి, ఉన్నత విద్యామండలి అధికారి డాక్టర్ మాథ్యూస్ శ్రీరంగం పాల్గొంటారన్నారు. ఒంగోలు పరిసర ప్రాంతాల్లోని డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, డిగ్రీలో చేరే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని వారి సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఇలాంటి అవగాహన సదస్సులు చీరాల, కంభం, పొదిలిలో కూడా త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా టూరిజం అధికారి బెన్హర్

ఒంగోలు అర్బన్: పర్యాటక మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా టూరిజం అధికారి బెన్హర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తున్న స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ అండ్ అప్లైడ్ న్యూట్రిషియన్‌లో 2023–24 సంవత్సరానికి హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. బీఎస్సీ (హెచ్ అండ్ హెచ్ ఏ) మూడేళ్ల డిగ్రీ కోర్సు, క్రాఫ్ట్ కోర్స్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటిసరి కోర్సు (ఒకటిన్నర సంవత్సరం), సర్టిఫికెట్ కోర్సు ఇన్ ఫుడ్ అండ్ బెవరేజ్ సర్వీస్ (ఆరు నెలలు) కోర్సులకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. కోర్సులు పూర్తయిన తర్వాత రాష్ట్ర పర్యాటక శాఖ హోటళ్లు, ప్రముఖ ఫైవ్‌స్టార్ హోటల్స్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. వివరాలకు www.sihmtpt.org వెబ్‌సైట్, 95021 13163, 97013 43846 నంబర్‌లను సంప్రదించవచ్చని తెలిపారు.

యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం



యోగా దినోత్సవం ర్యాలీ నిర్వహిస్తున్న ఆయుష్ శాఖ అధికారులు, సిబ్బంది

ఒంగోలు అర్బన్: యోగా చేయడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం కలుగుతుందని ప్రతి ఒక్కరూ యోగా చేయాలని జిల్లా ఆయుష్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పద్మజాతి అన్నారు. మంగళవారం ఈ నెల 21న నిర్వహించే 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాత రిమ్స్‌లోని ఆయుష్ శాఖ కార్యాలయం నుంచి ప్రకాశం భవనం చర్చి సెంటర్ వరకు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్ శాఖ డీడీ మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని వసుధైక కుటుంబం అనే నినాదంతో నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలనేది లక్ష్యమన్నారు. దీనిలో ఆయుష్ శాఖ సీనియర్ వైద్యుడు భీమ్‌నాథ్, ఆయుర్వేద డాక్టర్ సౌజన్య, యోగా గురువులు, యోగా సాధకులు పాల్గొన్నారు.

అధరహో..

వేలం కేంద్రాల్లో పొగాకు ధరలు ఆల్‌టైమ్ రికార్డులు నమోదు చేసుకుంటున్నాయి. ఎన్నడూలేని విధంగా ఈ సారి ధరలు అధరహో అనిపిస్తున్నాయి. నాలుగైదు దశాబ్దాల కాలంలో ఈ స్థాయిలో రికార్డు ధరలు రాలేదని పొగాకు బోర్డు అధికారులు అంటున్నారు. ఈ ఏడాది వేలం ప్రక్రియ ప్రారంభం నుంచే ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలోని 11 వేలం కేంద్రాల్లో కేజీ గరిష్ట ధర రూ.249 నమోదు కావడం కూడా రికార్డే. అంతర్జాతీయంగా డిమాండ్ ఉండడంతో గ్రేడ్లతో సంబంధం లేకుండా పొగాకు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు పోటీపడుతున్నారు. గత సీజన్‌తో పోలిస్తే ఈ సారి సరాసరి ధర సుమారు రూ.67 పెరిగింది. ఎప్పుడూ కనీవినీ ఎరుగని ధరలు పడడంతో పాత రికార్డులు బద్దలవుతున్నాయి.



- 'ఆల్‌టైం' రికార్డుల్లో నమోదవుతున్న ధరలు
- కేజీ పొగాకు అత్యధిక ధర రూ.249
- ఉమ్మడి ప్రకాశం 11 కేంద్రాల్లో ఇదే ధరకు కొనుగోలు చేయటం తొలిసారి
- గ్రేడ్‌లతో సంబంధం లేకుండా కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- సీఎం జగన్ మార్క్‌ఫెడ్‌ను దించిన తర్వాత ధరల్లో అనూహ్యమైన మార్పులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న పొగాకు రైతులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

ఒకప్పుడు పొగాకు సాగు చేసిన రైతులు గిట్టుబాటు ధర లభించక ఆత్మహత్య చేసుకున్నారు. నష్టాల పాలై కుటుంబాలకు కుటుంబాలే దిక్కులేనివయ్యాయి. నాడు పగాకు ఉన్న పొగాకు నేడు సిరులు కురిపిస్తోంది. పొగాకు పంట పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు అత్యధిక స్థాయి ధర పలకడంతో రైతు కాలర్ ఎగురేస్తున్నాడు. ఇదిలా ఉండగా ఈ సీజన్‌లో పొగాకు కేజీ ధర ఆల్‌టైం రికార్డు స్థాయికి చేరి రూ.249 పలికింది. కనిష్ట స్థాయి ధర రూ.160 కూడా పొగాకు పంట మొదలెట్టినప్పటి నుంచి పలకలేదంటే అతిశయోక్తి కాదు. అటు హైగ్రేడ్, ఇటు లో గ్రేడ్ పొగాకు ధర రెండూ కలుపుకున్నా ఇవి కూడా ఆల్‌టైం రికార్డే. సరాసరి కేజీ పొగాకు ధర రూ.239.43 పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత సీజన్‌లో సరాసరి ధర రూ.172.49 పలికింది. నాలుగేళ్లుగా ఏ సీజన్‌కు ఆ సీజన్ ధరలు పెరుగుదలకు అంతర్జాతీయంగా ఉన్న డిమాండ్ ఒక కారణమైతే రైతులు సంక్షోభంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ రంగ సంస్థ అయిన మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించడం మరో కారణం. అప్పటి నుంచే వ్యాపారులు కేజీ పొగాకు ధరను రూ.220కి దాటించి కొనుగోలు చేశారు.

ధరల పెరుగుదల ఇలా..

వేలం చివరికి వచ్చే కొద్దీ పొగాకు రేట్లు ఊహించని స్థాయిలో పెరుగుతున్నాయి. ఈ నెల ప్రారంభం నాటికి గ్రేడ్–1 పొగాకు కేజీ ధర రూ.200 ఉండగా వారం రోజుల్లో ధర అమాంతం రూ.14కు పెరిగి అత్యధిక ధర రూ.214 కు చేరింది. ఆ తర్వాత మార్కెట్ ఊపందుకుంది. ఎవరూ ఊహించని విధంగా 10వ తేదీ నాటికి ధర రూ.243కి చేరింది. క్రమంగా ధరలు పెరుగుతూ వచ్చాయి. 16వ తేదీ నాటికి ధర రూ.249 చేరి ఆల్‌టైం రికార్డు నమోదు చేసింది. ప్రస్తుతం ధరలు రూ.245 వద్ద స్థిరంగా కొనసాగుతున్నాయి. ఇదిలా ఉండగా మన కంటే ముందు ముగిసిన కర్ణాటక మార్కెట్‌లో కేజీ పొగాకు ధర రూ.270 పలికింది. అదే స్థాయిలో ధరలు పెరుగుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే వ్యాపారులు రేట్లు పెంచే విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారని, అందువల్లే ఇక్కడి మార్కెట్‌లో ఆ స్థాయిలో రేట్లు పెంచడం లేదనే వాదన రైతుల్లో ఉంది. డిమాండ్ ఉన్నా సరే వ్యాపారులు కొంత సిండికేట్‌గా ఏర్పడి భారీగా రేట్లు పెంచకుండా జాగ్రత్త పడుతున్నారని బోర్డు అధికారులు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే నెల రోజుల్లో రేట్లు మరింత పెరిగే అవకాశం ఉన్నా ఏ స్థాయిలో రేట్లు పెరుగుతాయనేది వ్యాపారుల చేతుల్లోనే ఉంది.

వ్యాపారుల్లో పెరిగిన పోటీ...

పొగాకు వేలంలో గుత్తాధిపత్యాన్ని లేకుండా చేయటంతో పాటు రైతులను నిలువు దోపిడీ చేస్తున్న పొగాకు వ్యాపారులకు సీఎం వైఎస్ జగన్ చెక్ పెట్టారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వ్యాపారులు పొగాకు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నా అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో వరుసగా టీడీపీ ప్రభుత్వ హయాంలో పొగాకు రైతులు ఐదేళ్ల పాటు నష్టాల పాలవుతూనే వచ్చారు. దీనిని గమనించిన సీఎం వైఎస్ జగన్ గత 2020–21 సంవత్సరంలో ప్రభుత్వ రంగ సంస్థ అయిన మార్క్‌ఫెడ్‌ను పొగాకు బహిరంగ వేలంలోకి దించారు. అందుకోసం రూ.220 కోట్లు విడుదల చేశారు. లో గ్రేడ్ పొగాకును కూడా ఎక్కువ ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నారు. అప్పటి నుంచి వేలంలో పొగాకు వ్యాపారులు పోటీపడి కొంటున్నారు. దీంతో రైతుకు మంచి ధర వస్తోంది.

70 శాతం నాణ్యమైన పొగాకు ఉత్పత్తి

ఈ సారి పంట దిగుబడి ఎక్కువ రావటంతో పాటు నాణ్యమైన పొగాకు 70 శాతం దిగుబడి వచ్చి లో గ్రేడ్ పొగాకు 30 శాతం దిగుబడి వచ్చింది. అందులోనూ పండిన పంటలో 5 నుంచి 6 శాతం పండుగుల్ల పొగాకు దిగుబడి వచ్చింది. రెండు సార్లు వేయటం వల్ల నిర్దేశించిన పంట లక్ష్యంకంటే అదనంగా 5,182 హెక్టార్లలో పంట సాగు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దాంతో పాటు పొగాకు బోర్డు నిర్దేశించిన పంట దిగుబడి 87.61 మిలియన్ కేజీల పొగాకు ఉత్పత్తి లక్ష్యంగా ఇచ్చారు. అయితే మాండూస్ తుపాను కారణంగా రెండుసార్లు పంట వేయటం వల్ల దిగుబడి అత్యధికంగా వచ్చింది. పొగాకు బోర్డు 87.61 మిలియన్ కేజీల పంట దిగుబడి లక్ష్యంగా ఇచ్చింది. అయితే 107 మిలియన్ కిలోల దిగుబడి వచ్చింది. అంటే 19.39 మిలియన్ కిలోల పొగాకు అదనంగా వచ్చింది.

5182 హెక్టార్లలో అదనంగా సాగు

ప్రకాశం, నెల్లూరు, గుంటూరు ఉమ్మడి జిల్లాల్లో కలిపి 11 పొగాకు వేలం కేంద్రాలున్నాయి. ఆయా ప్రాంతాల్లో దక్షిణ ప్రాంత నల్లరేగడి నేలలు (ఎస్‌బీఎస్), దక్షిణ ప్రాంత తేలకపాటి నేలలు (ఎస్‌ఎల్‌ఎస్)లలో కలుపుకొని మొత్తం 24,353 పొగాకు బ్యారన్లు ఉన్నాయి. వాటి పరిధిలో 30,240 మంది రైతులు పొగాకు పండిస్తున్నారు. పొగాకు బోర్డు నిర్దేశించిన ప్రకారం 58,300 హెక్టార్లలో పొగాకు సాగు చేయాల్సి ఉండగా, 63,482 హెక్టార్లలో పొగాకును సాగు చేశారు. 5182 హెక్టార్లలో పొగాకును అదనంగా సాగు చేశారు.

పొగాకు సరాసరి ధరలు

సంవత్సరం	ధర (రూ)
2018-19	126
2019-20	124.55
2020-21	148.54
2021-22	172.49
2022-23	239.43

(వేలం ఇంకా కొనసాగుతోంది)

బ్యారన్‌కు రూ.4 లక్షల వరకు ఆదాయం



ఈ సంవత్సరం నాలుగు పొగాకు బ్యారన్ల పరిధిలో 40 ఎకరాల పొగాకు చేశాను. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది పొగాకు ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. గత సంవత్సరం కేజీ పొగాకు ధర అత్యధికంగా రూ.180 అమ్ముకోగలిగాను. అదే క్వాలిటీ పొగాకు ధర ఈ సంవత్సరం కేజీ పొగాకు రూ.249 వరకు అమ్ముకున్నాను. బ్యారన్‌కు సాగు ఖర్చు పోను రూ.4 లక్షల వరకు ఆదాయం మిగిలే అవకాశం ఉంది. ఈ సంవత్సరం ధరల పట్ల రైతులు సంతోషంగా ఉన్నారు.

– మోపత్తి నారాయణ, పొగాకు రైతు, పెరిదేపి గ్రామం, కొండపి మండలం

వైద్య రంగానికి పెద్దపీట

- కరవది పీహెచ్‌సీ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



పీహెచ్‌సీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తోందని ఫలితంగా ప్రతి మండలంలో పీహెచ్‌సీ ఏర్పాటు, నూతనంగా 108, 104 వాహనాలను కొనుగోలు చేశారని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. కరవదిలో రూ.1.40 కోట్లతో నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని బాలినేని మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఒక్కో విభాగాన్ని డీఎంహెచ్‌వో రాజ్యలక్ష్మి, ఒంగోలు ఎంపీపీ పొగాకు ఉత్పత్తిదారుల చైర్మన్ వాకా బసివిరెడ్డి, సొసైటీ చైర్మన్ వాకా క్రిష్టారెడ్డి, ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు, తహసీల్దార్ పసుపులేటి మురళి, ఎంపీడీవో పి.అజిత, మండల మెడికల్ ఆఫీసర్ డా ఎస్.వాణి ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ డీ కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో బాలినేని మాట్లాడారు. ఒంగోలు మండలంలో కరవది–గుండాయపాలెం, పాతపాడు జంక్షన్ రోడ్డు, ఆలూరు–చేజర్ల, చేజర్ల–ఉలిచి, దశరాజుపల్లె–ఒంగోలు, ఒంగోలు–యరజర్ల రోడ్లను రూ.20 కోట్లతో నిర్మించినట్లు తెలిపారు. కరవది పీహెచ్‌సీలో పూర్తిస్థాయి సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. పీహెచ్‌సీ అప్రోచ్ రోడ్డు, ఆధునిక వైద్య పరికరాల కోసం త్వరలో రూ.40 లక్షలు మంజూరు చేయిస్తామని చెప్పారు. ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో మండలంలో వేగంగా అభివృద్ధి జరుగుతోందన్నారు. సభాధ్యక్షుడు డీ కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో నిలిచిపోయిన 75 పెన్షన్లను ఎమ్మెల్యే తిరిగి ఇప్పించారన్నారు. సొసైటీ చైర్మన్ వాకా కృష్టారెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు మంచిచేశారన్నారు. ఎంపీటీసీ మన్నె శ్రీనివాసరావు మాట్లాడుతూ కరవది నుంచి నాగులుప్పలపాడుకు రోడ్డు నిర్మించాలని, గుండ్లకమ్మ నదిపై చప్టా నిర్మిస్తే నాలుగు మండలాల కూడలిగా కరవది మారుతుందన్నారు. పొగాకు ఉత్పత్తిదారులు సమాఖ్య చైర్మన్ బసివిరెడ్డి మాట్లాడుతూ ఐక్యంగా ఉండి వైఎస్సార్ సీపీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, పీహెచ్‌సీ వైద్యుడు సుందర్‌ప్రసాద్, ఏపీఎం గోపి పాల్గొన్నారు. అనంతరం డ్వాక్రా సంఘాలకు చెక్‌లు బాలినేని అందజేశారు. నూతనంగా ప్రభుత్వం అందజేసిన ట్రాక్టర్‌ను బాలినేని స్వయంగా డ్రైవింగ్ చేశారు. అనారోగ్యంతో ఉన్న వైఎస్సార్ సీపీ నాయకుడు, మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పేరకం సుబ్బారావును ఆయన గృహంలో బాలినేని పరామర్శించారు. పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

● ఆణిముత్యాలకు పురస్కారం



సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఇంటర్మీడియెట్ విద్యార్థిని టి.బాలత్రివేణి





అవార్డు అందుకుంటున్న పదో తరగతి విద్యార్థులు దండెబోయిన బాజీ, మోగులూరి ఇందిర

పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు స్టేట్ బ్రిలియంట్ అవార్డ్సును మంగళవారం విజయవాడలోని 'ఏ' కన్వెన్షన్ సెంటర్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేశారు. జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు అవార్డులు అందుకున్నారు.

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి

- కలెక్టర్ దినేష్ కుమార్, ఎమ్మెల్యే మద్దిశెట్టి
- రూ.21.17 కోట్లతో నిర్మించిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వసతి భవనం ప్రారంభం



వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, పక్కన కలెక్టర్ దినేష్ కుమార్

కురిచేడు: విద్యా రంగంలో దేశంలో ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి మన రాష్ట్రంలో జరిగిందని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వసతి భవనాన్ని ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించగా, శిలాఫలకాన్ని కలెక్టర్ దినేష్ కుమార్ ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు అందించే సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వసతి భవనాన్ని సువిశాలంగా, చక్కని వాతావరణంలో 1100 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉండేందుకు అనువుగా నిర్మించారన్నారు. పదో తరగతి వరకు ఉన్న పాఠశాలను ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ రూ.21.17 కోట్ల గురుకుల పాఠశాల భవనాల నిర్మాణాన్ని పట్టించుకోకపోవడంతో తాను మంత్రులతో మాట్లాడి నిధులు విడుదల చేయించి భవన నిర్మాణం పూర్తిచేయించానన్నారు. దీన్ని ఇంటర్ వరకు అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. విద్యాభివృద్ధి కోసం సీఎం జగన్ అనేక పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. అనంతరం జగనన్న ఆణిముత్యాలను సన్మానించి వారికి మెడల్, సర్టిఫికెట్, నగదు బహుమతులు అందజేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు వడ్డించారు. కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ, రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నిమ్మకాయల రాజయ్య, జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనరు షేక్.సైదా, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల డీసీవో డీ జయ, ఆర్డీఓ తోట అజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వైవీ సుబ్బయ్య, వైస్ చైర్మన్ కే నాగేశ్వరరావు, ముండ్లమూరు, దొనకొండ ఎంపీపీలు సునీతా బ్రహ్మారెడ్డి, ఉషామురళి, సొసైటీ ప్రెసిడెంట్ మర్రి సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీలు బుల్లం వెంకట నర్సయ్య, కానాల శివారెడ్డి, కురిచేడు, కల్లూరు, బయ్యవరం, పడమర గంగవరం సర్పంచ్‌లు కేసనపల్లి కృష్ణయ్య, ఎస్ రామకృష్ణ, యం నాగేశ్వరరావు, కాసు భాస్కరరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాళ్లు బండి బలరామిరెడ్డి, పి.వి.రమణ, నాయకులు వరికూటి వెంకటేశ్వర్లు, వైవీ సుబ్బయ్య, మేరువ పిచ్చిరెడ్డి, మేరువ సుబ్బారెడ్డి, కండె గంగయ్య, సిద్ది వెంకటరెడ్డి, జ్యోతి అంకాలయ్య పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ, అభివృద్ధి ఫలాలు

- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

త్రిపురాంతకం: రాష్ట్ర ప్రజలకు ఇంటింటా సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. త్రిపురాంతకం అంబేడ్కర్ కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి మేలు చేయాలని, అభివృద్ధి పథాన నడిపించాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందిస్తున్నారని చెప్పారు. ఆయన వెంట డీఎల్‌డీవో సాయికుమార్, తహసీల్దార్ వీ కిరణ్, ఎంపీడీవో సాంబశివరావు, ఏఓ కే నీరజ, ఏపీవో సుజాత, ఈవోఆర్‌డీ మురళీమోహన్, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, గ్రామసర్పంచ్ పొన్న వెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య, ఎంపీటీసీ రిబకమ్మ, పార్టీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, సొసైటీ ప్రసిడెంట్ గోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మల్లికార్జున్, లింగయ్య, సుబ్రహ్మణ్యం, ప్రసాద్, సత్యనారాయణరెడ్డి, నక్కా చిన్న త్రిపురరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సమావేశం నిర్వహించారు. బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మహిళకు కరపత్రాన్ని అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మాధవరావు

బేస్తవారిపేట: మండలంలోని పెంచికలపాడు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే..గ్రామానికి చెందిన దొంతా గుండాలు(56) తెల్లవారుజామున బహిర్భూమి కోసం ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. ఆ సమయంలో ఒంగోలు–నంద్యాల హైవేరోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో గుండాలు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. సంఘటన జరిగిన తర్వాత హైవేరోడ్డు కావడంతో వేగంగా వెళ్లే వాహనాలు మృతుడి పైనుంచి మరికొన్ని వాహనాలు వెళ్లడంతో తల, కాళ్లు ఛిద్రమైపోయాయి. మృతునికి భార్య రమణమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్సై మాధవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేకాట శిబిరంపై ట్రైనీ ఎస్పీ దాడులు

● 7 బైకులు, 6 ఫోన్లు, రూ.42,200 నగదు స్వాధీనం

మార్కాపురం: ట్రైనీ ఎస్పీ అంకితా సురానా ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం మార్కాపురం మండలంలోని నికరంపల్లి గ్రామపొలాల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించారు. మొత్తం 10 మందిని అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి రూ.42,200 నగదు, 7 ద్విచక్రవాహనాలు, 6 ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ భీమానాయక్ తెలిపారు. దాడుల్లో రూరల్ఎస్సై సుమన్, సిబ్బంది పాల్గొన్నారు. కాగా మార్కాపురం రూరల్పోలీసు స్టేషన్లో పలు రికార్డులను ఆమె తనిఖీ చేశారు. ఫ్రెండ్లీ పోలిసింగ్ను పాటించాలని తెలిపారు.



దివ్యయోగం

నేడు ప్రపంచ యోగా దినోత్సవం

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం ● మానసిన ఒత్తిడి, శారీరక రుగ్మతలు దూరం

చక్కటి ఆరోగ్యవంతమైన అలవాట్లను కలిగి ఉండడంతో పాటు నియమబద్ధంగా చేసే వ్యాయామం, యోగాసనాల వల్ల మనసు, శరీరం, ప్రాణశక్తి మరింత ఉత్తేజితమవుతాయి. రక్తప్రసరణతోపాటు నాడీ వ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. శరీరం త్వరగా వార్ధక్యం బారిన పడకుండా కాపాడుతుంది. ప్రాణశక్తిని ఉద్దీపనం చేయడం ద్వారా ఆయుష్షు పెరుగుతుంది. ఉచ్ఛ్వాసనిశ్వాసలు, ఉద్వేగాలను క్రమబద్ధీకరించడం, ఆలోచనలను నియంత్రించడం, మనసును ఒకే విషయంపై నిమగ్నం చేయడం, సూర్య నమస్కారాలు, యోగాసనాలు, ధ్యానం, ప్రాణాయామం ప్రక్రియల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుంది. చేసే పనిలో శ్రద్ధ, ఏకాగ్రత పెరుగుతాయి. నేడు ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం..

దర్శి టౌన్:

ప్రకృతి ఒడిలో ఉదయిస్తున్న సూర్యుడికి ఎదురుగా నిల్చుని, ఆ కిరణాల ప్రసారాన్ని శరీరం ఆస్వాదిస్తుండగా సూర్య నమస్కారాలు చేయడం వల్ల ఎన్నో లాభాలున్నాయనేది పెద్దల మాట. శరీరాన్ని ఆసనాల రీతిలో కదల్చడం వల్ల వాటిని యోగాసనాలుగా పిలుస్తాం. సమస్త జీవులకు ప్రాణదాత అయిన సూర్యభగవానుడిని దైవంగా భావించి నమస్కరిస్తూ కొన్ని మంత్రాలు, భీజాక్షరాల్ని జపించినప్పుడు అది పూజ, శరీర కదలికలు వేగంగా, నిదానంగా ఉండటం వల్ల చూపరులకు అది వ్యాయామంలా అనిపిస్తుంది. ఎలా భావించినా క్రమం తప్పకుండా సూర్య నమస్కారాలు, యోగా చేయడం వల్ల బోలెడన్ని లాభాలున్నాయి.

సూర్య నమస్కారాలు, యోగా సాధన ఇలా..
ప్రణామాసనం, హస్త ఉత్థానసనం, పాద హస్తాసనం, ఆశ్వ సంచలనాసనం, పర్వాతాసనం, అష్టాంగ (సాష్టాంగ) నమస్కారాసనం, భుజంగాసనం(సర్పాసనం) వీటి


తూర్పుగంగవరంలో యోగ శిక్షణ పొందుతున్న గ్రామస్తులు

తర్వాత పర్వత, ఆశ్వసంచలన, పాద హస్త, హస్త ఉత్త, ప్రణామాసనాల్ని చేయాలి. ఈ 12 ఆసనాలతో ఒక ఆవృతం పూర్తవుతుంది. స్త్రీ, పురుషులెవరైనా తమ మానసిక, శారీరక స్థితిగతులను అనుసరించి క్రమంగా ఒకటి నుంచి ఆరంభించి 24 రౌండ్ల వరకు సూర్య నమస్కారాలు చేయవచ్చు. అయితే సాధన ప్రారంభించిన వెంటనే కొన్ని రోజులకే ఎక్కువసార్లు చేయాలనే ఆరాటం మాత్రం ఉండకూడదు. క్రమక్రమంగా కొద్ది నెలల కాలంలో ఎక్కువ రౌండ్లు చేయాలే తప్ప తమ శక్తిని మించి చేయకూడదు. ఈ మధ్య కాలంలో యోగా, సూర్య నమస్కారాలపై యువత, ప్రజలు అవగాహన పెంపొందించుకుంటున్నారు. మారుమూల గ్రామాల్లో సైతం యోగా ప్రత్యేక శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు.

ఉపయోగాలు అనేకం

- ✔ మొత్తం శరీర భాగం ముందుకు, వెనక భాగం వంగటం వల్ల అంతరేంద్రియాలకు వెన్నెముకకు రక్త ప్రసారం బాగా జరిగి అవి శక్తివంతంగా , పటిష్టంగా తయారవుతాయి. శరీర సౌష్టవం పెంపొందుతుంది.
- ✔ స్థూలకాయం తగ్గుతుంది. నేత్ర, హృదయ వ్యాధులు దూరమవుతాయి.
- ✔ చర్మం, శ్వేద గ్రంధులకు రక్త ప్రసారం జరగడం వల్ల అవి యాక్టివ్ అవుతాయి.
- ✔ చర్మవ్యాధులు నివారించబడతాయి. చర్మం కాంతివంతం అవుతుంది.
- ✔ మూత్ర సంబంధ వ్యాధులను నివారించవచ్చు.
- ✔ ఆహారాన్ని తీసుకోవడం, జీర్ణం చేసుకోవడం, విసర్జించటం లాంటి క్రియలు మెరుగై కణజాలానికి మంచి పోషణ కలుగుతుంది.
- ✔ వయసు మీద పడుతున్నా ముసలితనపు ఛాయలు కనిపించవు. శరీరానికి, మనసుకు ఒక లయ ఏర్పడి ఏకాగ్రత, జ్ఞాపక శక్తి పెరుగుతుంది.

యోగాతో ఆరోగ్యం, క్రమశిక్షణ



యోగా చేయడం వల్ల ఆరోగ్యం తోపాటు క్రమశిక్షణ పెరుగుతుంది. దశాబ్దకాలంలో అనేక పట్టణాలతో పాటు గ్రామాల్లో సైతం యోగా శిక్షణ ఇస్తూ ప్రజలలో ఆరోగ్యంపై అవగాహన పెంపొందిస్తున్నాం. దీర్ఘకాలిక వ్యాధులబారిన పడిన వారు ఆరోగ్యంగా ఉంటున్నారు. సాత్విక ఆహారంపైనా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. మనిషిలో ఎప్పుడైతే క్రమశిక్షణ ఉంటుందో ఆరోగ్యం, అభివృద్ధి దానంతట అవే వస్తాయి.

– శ్రీరామ్ గురూజీ,
యోగ, ధ్యాన, ఆరోగ్య శిక్షణ కేంద్రం, దర్శి

సమగ్ర దర్యాప్తుతో నిందితులకు శిక్ష

● ఎస్ఈబీ సమీక్షలో ఎస్పీ మలికాగర్గ్


మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: నాటుసారా, గంజాయి, మాదక ద్రవ్యాల కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా పక్కా సాక్ష్యాలతో కేసులు నమోదు చేయాలని ఎస్పీ మలికా గర్గ్ ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో(సెబ్) అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని వివిధ సెబ్ పోలీసు స్టేషన్ల పరిధిలో నమోదైన గంజాయి, అక్రమ మద్యం, ఎన్డీపీఎస్, ఇసుక కేసుల దర్యాప్తులో పురగోతిని ఎస్పీ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కేసుల విచారణలో జాగ్రతలు పాటించాలని, అరెస్టు విషయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలని చెప్పారు. విచారణలో ఉన్న కేసుల సంఖ్య తగ్గించుకోవాలని, అక్రమ వ్యాపారులపై విస్తృతంగా దాడులు నిర్వహించాలని చెప్పారు. నాటుసారా తయారీకి వినియోగించే ముడి సరుకు రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలని ఆదేశించారు. నాటుసారా తయారీ, రవాణా, విక్రయం, ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా దిగుమతి అవుతున్న మద్యం, నిషేధిత పొగాకు ఉత్పత్తుల రవాణా, గంజాయి సరఫరా తదితర నేరాల కట్టడికి సెబ్, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నాటుసారా తయారీనే జీవనోపాధిగా బతుకుతున్న వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలన్నారు. గంజాయి లాంటి మాదక ద్రవ్యాలతో కలిగే దుష్ప్రభావాలపై కాలేజీ విద్యార్థులకు అవగాహన కల్పించాలని చెప్పారు. గ్రామ రెవెన్యూ, మహిళా పోలీసుల ద్వారా సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేసి అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ఉపయోగించుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలను సేవించే వారిని గుర్తించి వారిలో మార్పు కోసం ప్రయత్నించాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, సెబ్ ఈఎస్ ఎ.ఆవులయ్య, సెబ్ అధికారులు ఎం.సుధీర్ బాబు, ఎ.శ్రీనివాసులు నాయుడు, సెబ్ ట్రైనీ డీఎస్పీ సుబ్రహ్మణ్యం, సీఐ వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

అశ్లీల చిత్రాలు పోస్టు చేసిన యువకుడి అరెస్టు

కనిగిరి రూరల్: ఫేక్ వాట్సప్ గ్రూప్ను తయారు చేసి అశ్లీల చిత్రాలను పోస్టింగ్ చేసిన యువకుడిని పోలీసులు మంగళవారం రాత్రి అరెస్టు చేశారు. సీఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సాయిబాబా థియేటర్ పక్క వీధిలో నివాసముండే డిగ్రీ విద్యార్థి మార్లెళ్ల కిషోర్ అదే వీధిలో నివసించే ఓ దంపతుల ప్రొఫైల్తో ఓ పార్టీకి చెందిన పేరు పెట్టి ఫేక్ వాట్సప్ గ్రూపును సృష్టించాడు. ఆ గ్రూప్లో కొందరు మహిళల ఫొటోలను మార్ఫింగ్ చేసి అసభ్యకరంగా గ్రూపులో పోస్టు చేశాడు. దీనిపై ఓ పార్టీ నాయకులు, మరికొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ రామకృష్ణారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతికత సహాయంతో నిందితుడు మార్లెళ్ల కిషోర్ను స్థానిక పొగాకు బోర్డు సమీపంలో అదుపులోనికి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన ఫోన్ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితున్ని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడు మార్లెళ్ల కిషోర్పై గతంలో లైంగిక దాడి యత్నం కేసు నమోదైంది. నిందితుడికి నత్తి, చెవుడు కారణంగా అమ్మాయిలు ఎవరూ ఇతన్ని పలకరించడం లేదని, పోర్న్ చిత్రాలు చూడటం అలవాటు చేసుకుని ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు తెలిసింది.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

దర్శి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో మహిళ మృతి చెంది. వివరాల్లోకి వెళితే..మండలంలోని తూర్పు వీరాయపాలెం గ్రామానికి చెందిన యరమల నాగేంద్రం (47) ఇంట్లో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. నాగేంద్రం మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

భీకర గాలులు.. మోస్తరు వాన


ఉప్పలపాడు వద్ద కూలిన విద్యుత్ స్తంభం

ఒంగోలు అర్బన్/కొండపి/కనిగిరి రూరల్/పొదిలి: జిల్లాలో మంగళవారం పలు ప్రాంతాల్లో గాలులతో వర్షం పడింది. నైరుతి రుతుపవనాలు వస్తున్నట్లు కనిపిస్తున్నా వాతావరణంలో మాత్రం వేడి తగ్గలేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సాయంత్రం వేళల్లో ఈదుగాలులు, ఉరుములతో వర్షాలు కురుస్తున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లాలో 40 డిగ్రీల నుంచి 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయినా వేడి ఉక్కపోత మాత్రం 45 డిగ్రీలను తలపించేలా ఉంది. సాయంత్రానికి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులతో వర్షం కురిసింది. పొదిలి మండలం పాములపాడులో నగిరికంటి ఏసుకు చెందిన గేదె పిడుగుపడి మృతిచెందింది. గిద్దలూరులో సాధారణ వర్షం కురిసింది. కొండపి మండలం పెరిదేపి నుంచి ఉప్పలపాడు వరకు గాలులకు పలుచోట్ల చెట్లు ఒరిగి రోడ్డుపై పడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న ఎస్సై వైవీ రమణయ్య, తమ పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని రోడ్లకు అడ్డంగా పడిన చెట్లను తొలగించారు. కందుకూరు నుంచి మండలానికి సరఫరా అయ్యే విద్యుత్ లైన్లు కట్టవారిపాలెం వద్ద దెబ్బతినడంతో సరఫరా నిలిచిపోయింది. ఉప్పలపాడు వద్ద నాలుగు విద్యుత్ స్తంభం నేలకొరిగింది. కనిగిరి ప్రాంతంలో సాయంత్రం వేళ ఈదురుగాలులతో వర్షం పడింది. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చిన ఇర్లపాడు క్రాస్ రోడ్డు సమీపంలో సొసైటీ అధ్యక్షుడు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి భవనంపై పిడుగు పడింది. భవనంపైన గల పిల్లర్ భాగం దెబ్బంది. కాంప్లెక్స్ భవనం పంచ రేకుల కింద చాల మంది పాదచారులు నిలబడి ఉన్నారు. పిడుగు రేకులపై పడి ఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేది. కాంప్లెక్స్లో శ్రీనుకు చెందిన కూల్డ్రింక్ షాప్లో విద్యుత్ బోర్డులు, పరికరాలు కాలిపోయాయి.

పొగాకు అదనపు కోటాపై పెనాల్టీ వద్దు


ఎంపీకి వినతిపత్రమిస్తున్న రైతు సంఘాల నాయకులు

ఒంగోలు: పొగాకు వేలం కేంద్రాల్లో అమ్మకాలు పూర్తవుతున్న తరుణంలో ఎక్సెస్ కోటాపై పెనాల్టీలు కర్నాటక తరహాలో మన రాష్ట్రంలోని తీసివేయాలని పొగాకు బోర్డు సభ్యులు, వేలం కేంద్రాల అధ్యక్షులు ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని కలిసి విజ్ఞప్తిచేశారు. మంగళవారం రాత్రి ఎంపీని స్థానిక ఆయన నివాసంలో కలుసుకుని పొగాకు రైతుల సమస్యలపై చర్చించారు. దీనిపై స్పందించిన ఎంపీ మాగుంట మంత్రి పీయూష్ గోయల్ను కలిసేందుకు రైతు నాయకుల బృందాన్ని తీసుకువెళతానని హామీ ఇచ్చారు. సమావేశంలో వైఎస్సార్సీపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మారెడ్డి సుబ్బారెడ్డి, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


మృతురాలు భూలక్ష్మి


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పామూరు: కారు బోల్తా పడి చెట్టును ఢీకొన్న ఘటనలో మహిళ మృతి చెందింది. ఈ ఘటన సోమవారం రాత్రి 12 గంటల సమయంలో పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు పెంచలకోన మార్గంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. పామూరు మండలం గుమ్మనంపాడుకు చెందిన కొల్లూరి భూలక్ష్మిని అదే మండలం కొండారెడ్డిపల్లె ఇవ్వగా ఆమెభర్త, కుటుంబసభ్యులు విశాఖపట్నంలో హోటల్స్, లాడ్జిలు నిర్వహిస్తూ జీవిస్తున్నారు. ఆమె సోదరి రమణమ్మ కుమార్తె వివాహం సందర్భంగా దుస్తులు కొనేందుకు ఆదివారం సాయంత్రం కంచిలో వెళ్లి తిరిగి వస్తుండగా రాపూరు మీదుగా పెంచలకొనవైపు వస్తున్న వాహనం ఎదురుగా ఉన్న కుక్కను తప్పించబోయి అదుపుతప్పి రోడ్డుపక్కన చెట్లవైపుకు దూసుకుపోయి చెట్టును ఢీకొట్టి వాహనం నుజ్జు నుజ్జయింది. ఘటనలో కారులో ఇరుక్కుపోయిన కొల్లూరి భూలక్ష్మి (40) అక్కడికక్కడే మృతి చెందింది. కారు నడుపుతున్న సునీల్, మరికొందరికి తీవ్ర గాయాలు కాగా విషయం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రులను నెల్లూరు వైద్యశాలకు తరలించారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు రాచర్ల స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.